క్లుప్తంగా

కుక్కల దాడిలో దూడ మృతి



కుక్కలు కరిచి మృతి చెందిన దూడ

దెందులూరు: మండలంలోని పోతునూరు గ్రామంలో బుధవారం రాత్రి కుక్కలు దాడి చేయడంతో దూల నాగరాజుకు చెందిన గేదె దూడ మృతి చెందింది. గురువారం తెల్లవారు జామున ఈ విషయాన్ని గుర్తించారు. వీధి కుక్కలు కోళ్లను చంపి తింటున్నాయని పలువురు ఆందోళన చెందుతున్నారు. కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

జల్లికొమ్మర స్కూల్లో శుభదిన్ భోజన్



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న దాత సత్తెమ్మ

గణపవరం: జల్లికొమ్మర యూపీ స్కూల్లో గురువారం మాజీ సర్పంచ్ కాసాని సత్తెమ్మ ఆర్థిక సాయంతో 200 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు శుభదిన్ భోజన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కురెళ్ల వెంకటరత్నం హాజరై డొక్కా సీతమ్మ బడి భోజనంలో విద్యార్థులకు కేంద్రం శుభదిన్ భోజన్ అమలు చేయడం విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందించడంతోపాటు, గ్రామంలోని వారిని సామాజిక భాగస్వామ్యం చేసినట్టు అవుతోందని అన్నారు. ఎంపీటీసీ బుద్దాల వెంకటేశ్వరరావు, గ్రామ పెద్దలు కవల కోదండ రాంబాబు, మద్దాల మహంకాళి ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెదవేగి: మండలంలోని దిబ్బగూడెంలో ఉప్పలపాటి చక్రపాణి ఆధ్వర్యంలో భావితరాల కోసం గో ఆధారిత ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. సుభాష్ పాలేకర్ కృషి ప్రధాన శిక్షకులు విజయ్ రామ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను వివరించారు. గోసేవకులు పాతూరి నాగభూషణం, నటులు నాగినీడు, సాంబిరెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కార్తీక దీపోత్సవం



శంఖు, చక్ర, నామాల ఆకృతిలో దీపాలు

ఉంగుటూరు: గురువారం సాయిబాబాకు ఇష్టమైన రోజుకావడంతో కైకరం సాయిబాబా మందిర ఆవరణలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు. మహిళలు శంఖు, నామం, చక్ర ఆకృతుల్లో దీపాలు వెలిగించారు.

ఉపాధి పని దినాలు పెంచాలి



ఉపాధి సిబ్బంది ఉద్యోగులతో సమావేశమైన ఎంపీడీఓ రాజ్‌మనోజు

ఉంగుటూరు: ఉపాధి కూలీలకు పని దినాలు పెంచేలా పనులు గుర్తించాలని ఉపాధి ఉద్యోగులకు ఎంపీడీఓ రాజ్ మనోజు సూచించారు. గురువారం ఉంగుటూరు ఎంపీడీఓ సమావేశపు హాలులో ఉపాధి సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. పశువులు షెడ్లు నిర్మాణాల్లో ఉపాధి కూలీలను ఉపయోగించవచ్చన్నారు. ఏడు రికార్డులు నమోదుచేయాలని, పని జరుగుతున్న చోట్లు బోర్డులు ఏర్పాటుచేయాలని, ఎంపీడీఓ రాజ్‌మనోజు సూచించారు. జాబ్‌కార్డులు ఎప్పటికపుడు అప్‌డేట్ గా ఉండాలన్నారు. ఏపీఓ మల్లేశ్వరరావు, మేట్లు, టీఏ లు, ఫీల్డు సహాయకులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా కామేష్

దెందులూరు: మండలం ఇన్‌చార్జి సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్‌గా పి.కామేష్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కామేష్ బాధ్యతలు స్వీకరించి, తహసీల్దార్ బి.సుమతిని మర్యాదపూర్వకంగా కలిశారు.

4న విద్యా సాఫల్య సర్వే

- అభ్యసన సామర్థ్యాలపై అంచనా లక్ష్యం
- దెందులూరులో 22, ఉంగుటూరులో 9 స్కూళ్ల ఎంపిక
- 3, 6, 8 తరగతుల విద్యార్థులకు పరీక్షలు
- ఇప్పటికే ప్రాక్టీస్ టెస్ట్‌ల నిర్వహణ



అన్నేవారిగుడెం యూపీ స్కూల్లో మాదిర ప్రశ్న పత్రాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు



ట్యాబ్‌ల్లో నాస్ ప్రశ్నలపై ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులు

నిడమర్రు: పాఠశాల విద్యా వ్యవస్థ స్వరూపం, ఆయా రాష్ట్రాల్లో అమలవుతోన్న అభ్యసన సామర్థ్యాల అంచనా వేసేందుకు దేశవ్యాప్తంగా డిసెంబరు 4న స్టేట్ ఎడ్యుకేషన్ ఎచీవ్‌మెంట్ సర్వే-2024 నిర్వహించనున్నారు. ఏలూరు జిల్లాలో ఎంపిక చేసిన 133 స్కూల్స్‌లో దెందులూరు నియోజకవర్గంలో 22, ఉంగుటూరు నియోజకవర్గంలో 9 ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో చదువుతోన్న 3, 6, 8 తరగతుల విద్యార్థులకు ఈ సర్వే పరీక్షలు ఓఎంఆర్ షీట్స్ విధానంలో ఉంటాయి. ఆంగ్ల మాధ్యంలో పరీక్షలు రాయాల్సుంటుంది. దీంతె ఎస్సీఈఆర్టీ రూపొందించిన మాదిరి ప్రశ్న పత్రాలతో ఎంపిక చేసిన స్కూళ్లలో ప్రాక్టీస్ టెస్టులు ఉపాధ్యాయులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర స్థాయి నుంచి మండల స్థాయి వరకు వర్క్‌షాప్‌లు విద్యాశాఖ పూర్తిచేసింది.

ఒకే రోజు మూల్యాంకనం

దేశవ్యాప్తంగా నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్సీఈఆర్టీ) ఆధ్వర్యంలో ఒకే రోజు సర్వే చేపట్టనున్నారు. ఈ నమూనా ఆధారిత విద్యా సర్వే చేపడతారు. ఈ సర్వే ద్వారా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో విద్యార్థుల అభ్యసన స్థాయిలపై నిర్మాణాత్మక నివేదిక తయారు చేస్తారు. ఈ ఫలితాల ఆధారంగా విద్యా సామర్థ్యాలు, అభ్యసన అంతరాలను గుర్తించడంతోపాటు విద్యా విధానం, బోధనా అభ్యసనాల్లో లోపాలను గుర్తించి, వాటిని అధిగమించేందుకు చర్యలు చేపడతారు. తెలుగు/ఇంగ్లీషు, గణితంపై పరిజ్ఞానం అంచనా వేసి జాతీయ సగటుతో పోల్చి రాష్ట్రాల సగటుతో ర్యాంక్‌లు ఇవ్వనున్నారు.

గణితం, ఇంగ్లీష్ / తెలుగు సబ్జెక్టులపై ప్రశ్నలు

3వ తరగతి విద్యార్థులకు అదే తరగతి సిలబస్‌పై, 6, 9 తరగతుల విద్యార్థులకు 5వ, 9వ తరగతి గణితం, ఇంగ్లీష్/ తెలుగు సబ్జెక్టుల సిలబస్‌పై ప్రశ్నలు ఉంటాయి. 3, 6 తరగతుల విద్యార్థులకు గణితం, జీకేలో 45 ప్రశ్నలు, 9వ తరగతి వారికి గణితం, సాంఘిక శాస్త్రం, సైన్స్ సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. ఓఎంఆర్ షీట్స్ విధానంలో పరీక్షలు రాయాల్సుంటుంది. దివ్యాగులు ఈ పరీక్షలకు హాజరైతే వారికి అదనపు సమయం కేటాయిస్తారు. ఈ పరీక్షలు ఉంగుటూరు నియోజకవర్గంలో భీమడోలు మండలంలో ఎంపీయూపీ అన్నేవారిగుడెం, పలెటి విద్యానికేతన్, పూళ్ల, భీమడోలు, ఎంఎం పురం, గుండుగొలను జెడ్పీ స్కూల్స్, గణపవరం మండలంలో మరియా మాంటిస్సోరి, నిడమర్రు మండలంలో తోలకలపల్లి నెం-1, ఉంగుటూరు ఉషోదయ హైస్కూల్స్‌లో చదువుతున్న విద్యార్థులకు ఈ సర్వే పరీక్షలు ఉంటాయి.

ప్రాక్టీస్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నాం



స్టేట్ ఎడ్యుకేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే-2024 ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం, గతేడాది మాదిరి ప్రశ్న పత్రాలతోపాటు ఎస్సీఈఆర్టీ నుంచి అందిన మాదిర ప్రశ్నాపత్రాలతో ప్రాక్టీస్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నాం. ఓఎంఆర్ షీట్స్ విధానంలో ఎస్సీఈఆర్టీ సూచనల మేరకు పరీక్ష నిర్వహించేలా హెచ్‌ఎంలకు అవగాహన కల్పించాం.

– గొర్రెల బాలయ్య, ఎంఈఓ, నిడమర్రు

22 స్కూళ్ల ఎంపిక



దెందులూరు నియోజకవర్గం మూడు మండలాల్లో 22 ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్‌లో ఈ పరీక్షలకు ఏర్పాట్లు చేస్తున్నాం. దేశంలోని ఆయా రాష్ట్రాల్లో అమలవుతోన్న విద్యా వ్యవస్థలోని బలాలు, బలహీనతలు అంచనా వేయడం. లోపాలను గుర్తించి, భవిష్యత్ అభ్యసనా విధానలపై తగిన మార్పులు చేసుకునేందుకు అవకాశం ఉంది.

– సబ్బిత నర్సింహమూర్తి, ఎంఈఓ, పెదపాడు

7న మెగా పేరెంట్స్ డే



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాసరావు

భీమడోలు: డిసెంబర్ 7న నిర్వహించే మెగా పేరెంట్స్ డేను విజయవంతం చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, దాతలను ఎంఈఓ-1 ఈదుపల్లి శ్రీనివాసరావు కోరారు. మండలంలోని పాతూరు, భీమడోలు నెం-3 పాఠశాలను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని పాతూరు ప్రాథమిక పాఠశాలలో రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల నోటు పుస్తకాలు, అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల కిచెన్ గార్డెన్ చూసి సిబ్బంది అభినందించారు. పాఠశాలలోని శుభదిన్ కార్యక్రమంలో చిన్నారులకు దాతలు అందించిన చికెన్ బిర్యానీ, కర్రీలను ఎండీఎంతో కలిసి పంపిణీ చేశారు. విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను మరింత మెరుగుపర్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రెడ్డియ్య, మండే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

30న కొవ్వలిలో సెమీక్రిస్మస్

దెందులూరు : కొవ్వలి సాల్వేషన్ ఆర్మీ చర్చిలో ఈ నెల 30న సెమీక్రిస్మస్ నిర్వహిస్తామని సాల్వేషన్ ఆర్మీ కోర్ అధికారి, మేజర్లు కె.సుబ్బారావు, కె.మేరీ కుమారి తెలిపారు. ముఖ్య అతిథులుగా సాల్వేషన్ ఆర్మీ డివిజనల్ కమాండర్ మేజర్లు కె.మోషే, జి.మేరీ కుమారి హాజరవుతారన్నారు. విశ్వాసులంతా ఈ వేడుకలో పాల్గొనాలని కోరారు.

రైతుల్లో తుపాను కలవరం



గుండుగొలను వద్ద ధాన్యంపై కప్పిన టార్పాలిన్లు



సంచుల్లో ధాన్యాన్ని నింపుతున్న భీమడోలు రైతులు

వరి మాసూళ్లు వాయిదా వేసుకోవాలంటున్న అధికారులు



పూళ్లలో వరిని కోస్తున్న మెషీన్



భీమడోలులో లారీలోకి బస్తాల ఎగుమతి

భీమడోలు: తుఫాన్ హెచ్చరికలతో రైతులు కలవరపడుతున్నారు. ఈనెల 29, 30వ తేదీల్లో అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఆరుగాలం పండించిన పంట చేతికందే దశలో రైతుల్లో తుపాన్ గుబులు పట్టుకుంది. వర్షాలవల్ల నష్టం వాటిల్లితే చేసిన అప్పులు తీర్చేదెలా అని ఆందోళన చెందుతున్నారు. భీమడోలు మండలలో 12,873 ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేశారు. ఇప్పటికే 9,200 ఎకరాల్లోని పంట నూర్పిళ్లు పూర్తయ్యాయి. సుమారు 12,293 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికారులు సేకరించారు. మండలంలో 24 వేల మెట్రిక్ టన్ను ల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేశారు. ఇంకా 12 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రావాల్సుంది. ఇంకా 3,673 ఎకరాల్లో పంట గట్టెక్కాల్సుంది. పీఎల్ వరి పంట కోత దశలో ఉంది. రైతులు కోత యంత్రాలతో మాసూళ్లు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. తేమశాతం నిబంధనలతో కొందరు రైతులు ధాన్యాన్ని రోడ్లపై ఆరబెడుతున్నారు. ధాన్యాన్ని గోనె సంచుల్లో ఉంచి టార్పాలిన్లతో రక్షించుకుంటున్నారు. ఈ సార్వా సీజన్‌లో 35 నుంచి 40 బస్తాల దిగుబడి మించి రాకపోవడంతో పెట్టుబడులు వస్తాయో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ తుఫాన్ నుంచి బయట పడితే ఉపశమనం పొందుతాయని చెబుతున్నారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో వరి కోతలను మూడు రోజుల పాటు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి ఎస్‌పీవీ ఉషారాణి రైతులకు సూచిస్తున్నారు.

ఘనంగా యాదవుల కార్తీక వన సమారాధన



జిల్లా అధ్యక్షులను సన్మానిస్తున్న యాదవ సంఘ నాయకులు

దెందులూరు: యాదవుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేయాలని రాష్ట్ర సాహిత్య మండలి కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, దెందులూరు ఎంపీపీ బొమ్మన బోయిన సుమలత, జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు ముమ్మడి చింతయ్య యాదవ్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ పెనుబోయిన మహేష్ యాదవ్ అన్నారు. గురువారం దెందులూరు మండలం పోతునూరు గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో యాదవ సంఘం నాయకులు నున్న లక్ష్మణరావు, డొక్కు వెంకటేశ్వరరావు, చవల ధర్మారావు, తలారి రామకృష్ణ, నాగనబోయిన ఉయ్యూరు, యాదవ సంఘం యూత్ ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పిల్లగోళ్ల శ్రీలక్ష్మి, చింతయ్య యాదవ్, సక్కుకుమారి, పెనుబోయిన మహేష్ యాదవ్, మాగంటి హేమ సుందర్, కాట్రు బాలు యాదవ్, తలకొండ జమలయ్య యాదవ్, నున్న శివ భవాని, డొక్కు సాయిరాం, పాముల సురేష్ తదితరులను సన్మానించారు. యాదవ కులస్తులు పాల్గొన్నారు.

అదనపు పని ఒత్తిడితో అనారోగ్యం



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న గ్రామ, సచివాలయ కార్యదర్శులు

భీమడోలు: గత ఐదు నెలలుగా అదనపు పని భారంతో తీవ్ర ఒత్తిడికి గురై అనారోగ్యాల బారిన పడుతున్నామని, పనిభారాన్ని తగ్గించాలని గురువారం స్థానిక ఎంపీడీఓ సీహెచ్ పద్మావతీదేవికి గ్రామ పంచాయతీ కార్యనిర్వాహక అధికారులు, సచివాలయ కార్యదర్శులు వినతిపత్రం అందించారు. ప్రతి రోజు మూడు సార్లు బయోమెట్రిక్‌లు వేయడం, సర్వేలు చేయించడం, సర్వేలో పురోగతి తగ్గినా ఉన్నతాధికారుల నుంచి వచ్చే క్రమశిక్షణా చర్యలకు బాధ్యులవుతున్నామని పేర్కొన్నారు. సిబ్బంది కొరతతో ఒక్కో కార్యదర్శికి రెండు, మూడు పంచాయతీలకు ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. సమావేశాలు, గ్రామ సభలు, ఇంటి పన్నులు వసూలు, జనన మరణాలు రిజిస్ట్రేషన్లు, వివాహ ధ్రువీకరణ పత్రాలు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్వహణలతో పాటు అంతులేని యాప్‌లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో ఈఓలు వెంకట్రావు, మురళీ, ముత్తయ్య, తనూజ, ధర్మ, గౌతమి, లావణ్య, జయరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే



గుండుగొలనులో జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

భీమడోలు: బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు, సామాజిక ఉద్యమకారుడు జ్యోతిరావు పూలే అని వక్తలు పేర్కొన్నారు. గుండుగొలను గ్రామంలో విగ్రహ ఆవిష్కర్త వగ్వాల అచ్యుతరామారావు ఆధ్వర్యంలో గురువారం పూలే 134వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గౌతమ బుద్దుని తర్వాత సమన్యాయం కోసం జ్యోతిరావు పూలే, అంబేద్కర్లు పోరాడారని వివరించారు. బాల్య వివాహాలను అరికట్టడం, వితంతువుల పునర్వివాహాల పట్ల ప్రజల్లో చైతన్యాన్ని రగిలింప చేశారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శిరిబత్తిన కొండబాబు, మాజీ ఉపసర్పంచ్ బర్ల రమణమూర్తి, వైఎస్సార్ సీపీ నేతలు గోరింకల మురళీ, వివిధ పార్టీల పెద్దలు సోమేశ్వరరావు, పాదిలాపు వెంకట్రావు, శ్రీను, పూడి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికకు సర్వం సిద్ధం

దెందులూరు: సాగునీటి సంఘాల ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఇరిగేషన్ శాఖ డివిజనల్ ఇంజనీర్ గనిరాజు అన్నారు. గురువారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో డిసెంబర్ 8న మొత్తం 71 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఒక్కో నీటి సంఘానికి ఒక ఎన్నికల అధికారి, సహాయ అధికారి విధులు నిర్వహిస్తారని తెలిపారు. 142 మంది అధికారులకు ఎన్నికల శిక్షణ పూర్తి చేశామన్నారు. తహసీల్దార్, ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజినీరు సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియను సమన్వయంతో పర్యవేక్షణ చేస్తారని చెప్పారు.

జిల్లా కేంద్రాల్లోనే లీడర్‌షిప్ శిక్షణ ఇవ్వాలి

పెదపాడు : జిల్లా కేంద్రంలోనే లీడర్‌షిప్ శిక్షణ ఏర్పాటు చేయాలని స్కూల్ టీచర్స్ అసోషియేషన్ ఏలూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కాటి వెంకటరమణ, తోట ప్రసాద్ తెలిపారు. గతంలో ప్రభుత్వం 9 కేంద్రాల్లో శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయం తీసుకొందని, సంఘాల ప్రాతినిధ్యం మేరకు జిల్లా కేంద్రంలో నిర్వహిస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదని ఆరోపించారు. భామిని మండలం నుకలజోడు పాఠశాల హెచ్ఎం సిరిపురపు శ్రీనివాసరావు గజపతినగరంలో లీడర్‌షిప్ ట్రైనింగ్‌లో గుండెపోటుతో మృతి చెందడం తీరని లోటని పేర్కొన్నారు.

ఎస్‌సీఆర్‌యూసీసీ మెంబర్‌గా సక్కు కుమారి

దెందులూరు: దెందులూరు మాజీ జెడ్పీటీసీ యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు ముమ్మడి చింతయ్య సతీమణి సక్కుకుమారి సౌత్ సెంట్రల్ డివిజనల్ రైల్వేయూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ (ఎస్‌సీఆర్‌యూసీసీ) మెంబర్‌గా నియమితులయ్యారు. గురువారం కేంద్ర రైల్వేశాఖ ఈమేరకు లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేసింది. సక్కుకుమారిని మండలంలోని చల్లచింతలపూడి గ్రామస్తులు అభినందించారు.

ఆలయ ఈఓకు నోటీసు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈ నెల 3న స్థానిక పడమర వీధి వేంకటేశ్వర స్వామి దేవస్థానం వద్ద ఉన్న దొంగల మండపం సమీపంలో రెండు వృక్షాలను నరికించిన వేంకటేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారికి ఏలూరు అర్బన్ తహసీల్దార్ జీవీ శేషగిరి నోటీసు జారీ చేశారు.

సమస్యలతో విద్యార్థుల సహవాసం

- పాఠశాలల్లో నిరుపయోగంగా ఫిర్యాదుల బాక్సులు
- హెచ్‌ఎంల వద్దే తాళాలు
- ఉన్నతాధికారుల దృష్టికెళ్లని సమస్యలు
- ఫిర్యాదు చేయడానికి వెనుకాడుతున్న విద్యార్థులు



నగరంలోని ఒక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టె

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి, వారి సమస్యలు ఉన్నతాధిరుల దృష్టికి తీసుకెళ్లడానికి పాఠశాలల్లో చాలా కాలం క్రితమే ఫిర్యాదుల బాక్కులు ఏర్పాటు చేశారు. ఫిర్యాదు చేయాలంటే ఉపాధ్యాయులో, ప్రధానోపాధ్యాయులో కక్ష కట్టి తమను మరిన్ని సమస్యల్లోకి నెట్టేస్తారనే భయం విద్యార్థుల్లో నెలకొంది. ఆ బాక్సుల్లో విద్యార్థులు తమ ఫిర్యాదులు వేసిన సందర్భాలు నామమాత్రమనే చెప్పాలి. ఏలూరు నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు నిత్యం ఏదో ఒక సమస్యతో సతమతమౌతున్నారు. మరుగుదొడ్ల వద్ద దుర్గంధం వెదజల్లుతోందని చెబుతున్నారు. కొన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత ప్రమాణాల మేరకు లేదని, రుచికరంగా ఉండకపోవడంతో ఇంటి నుంచే భోజనాలు తెచ్చుకుని తినాల్సి వస్తోందని వాపోతున్నారు. ముఖ్యంగా బాలికలపై కొందరు ఉపాధ్యాయులు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని, ప్రైవేట్‌పార్ట్‌లను తాకుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఇటీవల తరచూ వార్తలు వస్తున్నాయి.

ఫిర్యాదు చేయడానికి వెనుకడుగు

విద్యార్థుల సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి రావడం కోసం ఏర్పాటుచేసిన ఫిర్యాదుల బాక్సులు కొన్ని పాఠశాలల్లో మూలనపడేశారు. మరికొన్ని పాఠశాలల్లో కంప్లెయింట్ బాక్సులు ఉన్నప్పటికీ అందరికీ కనబడేలా ఉండడంతో ఫిర్యాదులు వేయడానికి విద్యార్థులు వెనుకాడుతున్నారు. ఫిర్యాదులు వేసే సమయంలో ఎవరైనా గమనించి తమనే లక్ష్యం చేస్తారనే ఆందోళన వారిలో ఉంది. బాలికల విషయంలో జరిగే అసభ్య ప్రవర్తనలపై ఫిర్యాదులు చేయడానికి బాలికలు కూడా భయపడుతున్నారు.

విద్యార్థి సంఘాల ఆగ్రహం

కొందరు విద్యార్థులు బాక్సుల్లో ఫిర్యాదులు వేసినప్పటికీ అవి ఉన్నతాధికారుల దృష్టికెళ్లే పరిస్థితి కనిపించడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదుల బాక్సుల తాళాలు అదే పాఠశాల ప్రధానోపాధ్యాయుని వద్ద ఉంచడమే ఇందుకు ప్రధాన కారణంగా చెబుతున్నారు. ఫిర్యాదులను చదివే అవకాశం, హెచ్‌ఎంపై చేసే ఫిర్యాదు కాపీలను తొలగించే వెసులుబాటు హెచ్‌ఎంలకే ఉండటంతో విద్యార్థులకు న్యాయం జరిగే అవకాశం ఉండదని, వారిపై ప్రతీకార చర్యలు తీసుకునే ప్రమాదం ఉందని వాపోతున్నారు. సమస్యలు తెలుసుకోవడానికి పటిష్టమైన వ్యవస్థ లేకపోవడంతో విద్యార్థులు సమస్యలతో సహజీవనం చేయాల్సి వస్తోందని చెబుతున్నారు.

ఉన్నతాధికారులు స్పందించాలి

ఫిర్యాదుల బాక్సులు చాలా పాఠశాలల్లో అందుబాటులో లేక విద్యార్థుల సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ బాక్సులతో విద్యార్థులకు ఒనగూరే ప్రయోజనాలను దూరం చేసే ఉద్దేశం కనిపిస్తోంది. విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించే ఉపాధ్యాయుల నిగ్గు తేలడానికి ఫిర్యాదుల బాక్సులు ఉపయోగపడతాయి. ఈ విషయంపై అధికారులు వెంటనే స్పందించాలి.

– కె.లెనిన్, జిల్లా కార్యదర్శి, ఎస్ఎఫ్ఐ

ఎంఈఓల వద్దే తాళాలు ఉంచాలి

విద్యార్థులు నేరుగా ఫిర్యాదు చేయలేని అనేక సమస్యలను ఫిర్యాదుల బాక్సుల ద్వారా తెలుపుకునే అవకాశం ఉంటుంది. ఐతే ఈ బాక్సుల తాళాలు ప్రధానోపాధ్యాయులు, ఎంపీడీఓల వద్ద ఉంచాలని తీసుకున్న నిర్ణయం సరికాదు. ఈ బాక్సుల తాళాలు ఎంఈఓల వద్ద ఉంచాలి.

– కాకి నాని, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు